నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, సోమవారం 29 ఏప్రిల్ 2024 VIKARABAD




వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం చిల్‌ముల్‌మైలారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల

# బిల్లులకు మోక్షమెప్పుడో..?

## పెండింగ్‌లోనే రూ.10 కోట్ల చెల్లింపులు

- 'మన ఊరు-మన బడి'లో పూర్తైన పనులకు విడుదల కాని నిధులు
- విముఖత చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బిల్లులకోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- అప్పులు చేసి పనుల నిర్వహణ.. ఆర్థిక ఇబ్బందుల్లో గుత్తేదార్లు
- ఇప్పటికే 20 ప్రభుత్వ బడుల్లో పనులు పూర్తి..
- 'మన ఊరు-మన బడి'కి బ్రేక్ ..'అమ్మ ఆదర్శ పాఠశాల' అమలు

వికారాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మన ఊరు-మన బడి కార్యక్రమానికి బ్రేక్ పడింది. వికారాబాద్ జిల్లాలో 'మన ఊరు-మన బడి' పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మొదటి విడుతలో ఎంపికైన బడుల్లో దాదాపుగా అన్ని స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు రూ.10 కోట్ల బిల్లుల చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల విడుదలకు సుముఖంగా లేకపోవడంతో చెల్లింపుల ప్రక్రియ పెండింగ్‌లో పడింది. మరోవైపు పనులు పూర్తై నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పనులను పూర్తి చేసిన చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా మొదటి విడుతలో ప్రభుత్వం 371 స్కూళ్లను 'మన ఊరు-మన బడి'లో భాగంగా ఎంపిక చేయగా.. 20 స్కూళ్లలో పనులు పూర్తికాగా వాటిని ఇప్పటికే అధికారులు ప్రారంభించారు. కాగా 347 స్కూళ్లలో 20 శాతం మేర పనులు పూర్తయ్యాయి. సంబంధిత పనులకు సంబంధించి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది.

### 'మన ఊరు-మన బడి' స్థానంలో..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 'మన ఊరు-మన బడి' స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. అయితే ఈ ప్రోగ్రాంలో గతంలో 'మన ఊరు-మన బడి'లో భాగంగా పనులను ప్రారంభించిన స్కూళ్లు కాకుండా కొత్త బడులను ఎంపిక చేస్తున్నారు. ఇప్పటికే 20 శాతం వరకు పనులు పూర్తైన స్కూళ్లు కాకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో కొత్త స్కూళ్లను ఎంపిక చేస్తుండడంపై స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తున్నది. సగం వరకు పనులు పూర్తైన బడులను ఎంపిక చేసి త్వరగా వసతులు కల్పిస్తే పిల్లలకు బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

### 20 స్కూళ్లలో మారిన రూపురేఖలు..

మన ఊరు-మన బడి కార్యక్రమంతో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ బడులకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. మొదటి విడుతలో మండలానికి, మున్సిపాలిటీకి రెండు చొప్పున ప్రభుత్వ బడులను ఎంపిక చేసి ఇప్పటివరకు జిల్లాలోని 20 ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలను కల్పించారు. తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్తు, గ్రీన్ చాక్‌బోర్డులు, పెయింటింగ్, ప్రహరీలు, కిచెన్‌షెడ్లు, శిథిలమైన తరగతి గదుల స్థానంలో కొత్తవి నిర్మాణం, మరమ్మతులు, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు వంటి వసతులు కల్పించారు. జిల్లాలో 1054 ప్రభుత్వ పాఠశాలలుండగా వాటిలో మొదటి విడుతలో 371 బడుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అప్పటి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొదటి విడుతలో ఎంపికైన స్కూళ్లలో ఉన్నత పాఠశాలలు-111, ప్రాథమికోన్నత పాఠశాలలు-40, ప్రాథమిక పాఠశాలలు-220 ఉన్నాయి.

# శభాష్ సాయిచరణ్

## సాహస బాలుడ్ని అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి

కొత్తూరు, ఏప్రిల్ 28 : నందిగామ మండల కేంద్రంలోని అలిన్ ఫార్మాలో ఈ నెల 26న జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురి ప్రాణాలను కాపాడిన బాలుడు సాయిచరణ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సాయిచరణ్‌ను సీఎం వద్దకు తీసుకెళ్లగా.. అతడిని సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. సాయిచరణ్ సాహసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారని ఎమ్మెల్యే శంకర్ చెప్పారు. నందిగామ మండల కేంద్రానికి చెందిన 15 ఏండ్ల సాయిచరణ్ ఇటీవలే టెన్త్ పూర్తి చేశాడు. కార్య క్రమంలో ఎంపీటీసీ కొమ్ముకృష్ణ, చంద్రపాల్, కుమారస్వామిగౌడ్, బాలుడి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సాయిచరణ్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కనే ఎమ్మెల్యే శంకర్





# మహిళలే నిర్ణేతలు

## చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో అతివల ఓట్లే అధికం

- మహిళా ఓటర్లపై ప్రత్యేక దృష్టిసారిస్తున్న రాజకీయ పార్టీలు
- నారీశక్తిపై బీఆర్ఎస్ పార్టీ నజర్

రంగారెడ్డి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల జయపజయాలను వారే నిర్ణయించనున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. వీటిలో వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. చేవెళ్ల, పరిగి సెగ్మెంట్లలో పురుషులు, స్త్రీ ఓటర్ల మధ్య వ్యత్యాసం వెయ్యి లోపే ఉన్నది. మిగతా మూడు చోట్ల కూడా అభ్యర్థుల గెలుపు, ఓటములను ప్రభావితం చేసే స్థితిలో అతివలు ఉన్నారు.

### ఓటు నమోదులోనూ ముందే..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం కొత్తగా ఓటు నమోదుకు అవకాశం కల్పించింది. ఫామ్-6 ద్వారా రంగారెడ్డి జిల్లాలో 53,216 మంది కొత్తగా ఓటు హక్కును పొందారు. ఇందులోనూ ఎక్కువగా మహిళలే ఓటర్లుగా నమోదు కావడం విశేషం. కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్న వారిలో పురుషులు 25,168 మంది ఉండగా.. మహిళలు 28,042 మంది ఉన్నారు. జిల్లాకు అనుబంధంగా ఐదు పార్లమెంట్ స్థానాలుండగా..అన్నింట్లోనూ మహిళా ఓట్లే కీలకం కానున్నాయి.

### మహిళా ఓటర్లపై పార్టీల నజర్..

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నాయి. వారిని మెప్పించగలిగితే గెలుపు అవకాశాలు మెండుగా ఉంటాయని నాయకులు భావిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్ల జాబితాలను జల్లెడ పడుతున్నారు. కుల, యువజన సంఘాలు, ద్వితీయ శ్రేణి, మండల, గ్రామ స్థాయి నాయకులతో పాటు మహిళా సంఘాలను ప్రసన్నం చేసుకునే దిశగా వ్యూహాలు పన్నుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఓట్లే అభ్యర్థుల విజయవకాశాలపై ప్రభావాన్ని చూపడంతో ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లోనూ మహిళా ఓటర్ల మద్దతు కూడ గట్టుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ ప్రయత్నాలను మొదలెట్టాయి.

### మహిళా ఓటర్లపై బీఆర్ఎస్ ప్రత్యేక ఫోకస్ ..

కేసీఆర్ హయాంలో మహిళల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో మహిళా ఓటర్లపై పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. పదేండ్ల కాలంలో వివిధ పథకాల ద్వారా అతివలకు చేకూర్చిన లబ్ధిని ఇంటింటికీ తిరిగి మహిళలకు వివరించి..బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. బీసీ నినాదంతోపాటు మహిళా నినాదాన్ని ప్రధాన అస్త్రంగా చేసుకుని పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలంతా ప్రచారం చేస్తున్నారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మహేశ్వరం | 2,85,137 | 2,71,538 | 66 | 5,56,741 |
| రాజేంద్రనగర్ | 3,16,979 | 2,95,153 | 38 | 6,12,170 |
| శేరిలింగంపల్లి | 4,00,361 | 3,57,600 | 141 | 7,58,102 |
| చేవెళ్ల | 1,35,429 | 1,34,526 | 05 | 2,69,960 |
| పరిగి | 1,33,568 | 1,32,989 | 09 | 2,66,566 |
| వికారాబాద్ | 1,14,965 | 1,16,660 | 14 | 2,31,639 |
| తాండూరు | 1,17,821 | 1,25,364 | 07 | 2,43,192 |
| మొత్తం | 15,04,260 | 14,33,830 | 280 | 29,38,370 |

# రంజిత్‌రెడ్డిని ఓడించండి..


ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

- ఆయన ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారు.
- వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి వచ్చి వాటిని కలుషితం చేస్తున్నారు
- కేసులకు భయపడకండి.. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం

మొయినాబాద్, ఏప్రిల్ 28 : ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్న రంజిత్‌రెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తనూ సన్నద్ధం చేసేందుకు ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని స్టార్ కన్వెన్షన్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి వచ్చి వాటిని కూడా వ్యాపార కోణంలోనే చూస్తూ కలుషితం చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తుల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను కేసీఆర్ ఆదరించి చేరదీసి ఎంపీలుగా గెలిపిస్తే స్వార్థం కోసం పార్టీలు మారారని మండిపడ్డారు. రంజిత్‌రెడ్డికి సీఎం కేసీఆర్, కేటీఆర్ అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు.

### ఓట్లు అడుక్కునే స్థితిలో..

చేవెళ్ల ఎంపీగా పనిచేసిన రంజిత్‌రెడ్డి ఎప్పుడు కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని.. అభివృద్ధికి కృషి చేయలేదని సబితారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డిని, ఆరు గ్యారెంటీలను చూసి ఓట్లు వేయాలని ఓటర్లను అడుక్కునే దుస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి జై శ్రీరాం అనండి ఓటేయండి... నరేంద్ర మోదీని చూసి ఓటేయాలని అడుగుతున్నారన్నారు. వారిద్దరూ నియోజకవర్గాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గతంలో రంగారెడ్డి జడ్పీచైర్మన్‌గా పనిచేసి ఎంతో అభివృద్ధి చేశారని.. బీసీ కులాల అభ్యున్నతికి పాటుపడ్డారని.. అలాంటి వ్యక్తిని ఎంపీగా గెలిపించుకోవాలన్నారు.

### న్యాయపరమైన చిక్కులు వస్తాయని తెలిసినా..

జీవో 111ను ఎత్తివేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని తెలిసినా.. సుప్రీంకోర్టు వరకైనా వెళ్లి పోరాటం చేస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొని.. దానిని ఎత్తివేస్తున్నట్లు జీవోను జారీ చేయించారని గుర్తు చేశారు. జీవో 111 ఎత్తివేత కోసం తీసుకొచ్చిన జీవో 69ను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసానిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 140 రోజుల్లోనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కరెంట్ పోతే ప్రజలకు కేసీఆరే గుర్తుకొస్తున్నారని తెలిపారు. కార్యకర్తలందరూ సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని.. కేసులకు భయపడొద్దన్నారు. ప్రతి కార్యకర్తకూ స్థానిక ఎమ్మెల్యే నుంచి కేసీఆర్ వరకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు ఇంటింటికెళ్లి బీఆర్ఎస్ హయాంలో అమలైన పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి రాంబాబుయాదవ్, రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఆంజనేయులు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ రితీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గణేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండ ల ప్రధాన కార్యదర్శి నర్సింహాగౌడ్, ఉపాధ్యక్షుడు జయవంత్, రవూఫ్, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీహరియాదవ్, మహబూబ్, కృష్ణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పరమేశ్, యాదగిరిచారి, మనోజ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు


వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

### కారును గుర్తుంచుకో..

బడంగ్‌పేట, ఏప్రిల్ 28 : సారు కేసీఆర్‌ను గుర్తుపెట్టుకొని.. కారు గుర్తుకు ఓటేసి చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి వాకర్స్‌కు విజ్ఞప్తి చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న చందన చెరువుకట్టపై ఆదివారం ఆమె ఉదయం నడకలో వాకర్స్‌ను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి కట్టుబడి పనిచేసేది బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. హామీల అమల్లో కాంగ్రెస్ సర్కారు విఫలమైందన్నారు. ఓట్లు అడిగేందుకు వచ్చే ఆ పార్టీ నాయకులను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి సమస్య, కరెంట్ కష్టాలు పెరిగాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. మతం, కులం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మీర్‌పేట వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేశ్‌గౌడ్, కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోడకొండలోని కొనుగోలు కేంద్రం వద్ద కుప్పలుగా పేరుకుపోయిన ధాన్యం రాశులు



# కేంద్రాల్లోనే ధాన్యం..

- 20 రోజుల క్రితం బోడకొండ, లోయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- సక్రమంగా జరుగని కొనుగోళ్లు
- తేమ, తాలు అంటూ నిరాకరణ
- కుప్పలుగా పేరుకుపోతున్న ధాన్యం
- కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వీడకపోతే భారీ నష్టం
- త్వరగా కొనాలని అన్నదాతల విజ్ఞప్తి

మంచాల, ఏప్రిల్ 28 : యాసంగి ధాన్యం కొనుగోళ్లలో అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంతో ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బోడకొండతోపాటు దానికి అనుబంధంగా ఉన్న లోయపల్లిలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 20 రోజుల కిందట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడికి రైతులు తీసుకెళ్లిన వరి ధాన్యాన్ని వెంటనే తూకం వేయకుండా తాలు, తేమ శాతం ఉందని చెప్పి నిర్వాహకులు కొనడంలేదు. దీంతో అన్నదాతలు ధాన్యాన్ని అక్కడే ఉన్న స్థలంలో ఉంచడంతో కుప్పలుగా పేరుకుపోతున్నది. అంతేకాకుండా మౌలిక వసతులు కల్పించక.. గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడం తో రైతుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ధాన్యాన్ని 50 కిలోల చొప్పున బస్తాల్లో నింపి తూకం చేసి లారీల్లో లోడ్ చేసి.. రైస్‌మిల్లులకు తరలించిన తర్వాత తూకం 48 కిలోలకే వచ్చిందని.. అందువల్ల ఆ మొత్తానికే డబ్బులు చెల్లిస్తామని అధికారులు చెబుతుండడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి తూకం చేసిన 50 కిలోలకే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులను అడిగితే ఎండలతో బస్తాల్లోని వడ్లు ఎండి వాటి బరువు తగ్గుతున్నదని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాలకు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనడంతోపాటు తూకం వేసి సంచుల్లో నింపిన మొత్తానికి డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు. కాగా లోయపల్లి గ్రామంలో కొంతమంది రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురాకుండా పొలాల్లోనే వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.



లోయపల్లిలో వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు